ఆంధ్రజ్యోతి

శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు

మంగళవారం 14 మే 2024

5



ధర్మవరంలోని దుర్గానగర్ పాఠశాల పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు

ఓటర్ల దండయాత్ర

జిల్లావ్యాప్తంగా పోటెత్తిన ఓటర్లు

- రాత్రి వరకు కొనసాగిన పోలింగ్
- ఎండ, వానను లెక్కచేయని ఓటర్లు
- ప్రలోభాల పర్వం కొనసాగించిన వైసీపీ నాయకులు
- పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు
- పోలింగ్ ప్రశాంతం..
- నిర్ణయం.. నిక్షిప్తం..





తొలి ఓటు వేసేశాం..

పుట్టపర్తి, మే 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఓటర్లు పోటెత్తారు. దండయాత్ర చేశారు. ఎన్నడూలేని విధంగా సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సోమవారం బారులు తీరారు. ఉదయం నుంచి రాత్రి వరకు వరుస కట్టారు. ఎండ, వానను లెక్కచేయక ఓటెత్తారు. రాత్రయినా క్యూలు తగ్గలేదు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జిల్లాలో ఒక ఎంపీ, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సోమవారం పోలింగ్ నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. సాయంత్రం 5 గంటలకు పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఓటర్లకు ఓటు వేసేందుకు అనుమతిచ్చారు. ఉదయం పోలింగ్ మందకొడిగా ప్రారంభమైనా 9 గంటలకు ఊపందుకుంది. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఏ పోలింగ్ కేంద్రం వద్ద చూసినా ఓటర్లు బారులుతీరారు. పలుచోట్ల ఈవీఎంలు మొరాయించి, పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. 9 గంటల నుంచి ఊపందుకుంది. ఓటింగ్‌లో పాల్గొనేందుకు వృద్ధులు, యువత, మహిళలు బారులుతీరి గంటల తరబడి ఎండవేడిమిని లెక్క చేయకుండా వేచి ఉన్నారు. జిల్లాలో ఉయయం చిరుజల్లులు కురిశాయి. పది గంటల తరువాత ఎండవేడిమి తీవ్రమైంది. పలు పోలింగ్ కేంద్రాల్లో నీడలేకున్నా ఎండలో నిల్చొని ఓటేశారు. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ శాతం అన్ని నియోజకవర్గాల్లో 70 శాతం పైబడి నమోదైంది. గత ఎన్నికల్లోకంటే ఓటర్లు ఉత్సాహంగా తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. పుట్టపర్తి, హిందూపురం, ధర్మవరం నియోజకవర్గాల్లో రాత్రిదాకా పోలింగ్ కొనసాగింది. ధర్మవరం పట్టణం, హిందూపుం పరిధి కొట్నూరు, బీరేపల్లి, పలగలపల్లి, కంచిసముంద్రంతోపాటు పుట్టపర్తి, కొత్తచెరువు, బ్రాహ్మణపల్లి, కేశాపురం, కొడపగానిపల్లి, మరకుంటపల్లిలో రాత్రి 9 గంటలదాకా పోలింగ్ సాగింది. కాస్త వెలుగులోనే ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లే పోలింగ్ కేంద్రాల వద్ద అధికంగా కనిపించారు. యువత తొలిసారి ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఉత్సాహం చూపారు. జిల్లాలో పలుచోట్ల వైసీపీ నాయకులు.. ఓటర్లను ప్రలోభాలకు లోనుచేయడంతోపాటు కవ్వింపు చర్యలకు దిగారు. దీనికి టీడీపీ నాయకులు అడ్డు చెప్పడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదాలు, ఉద్రిక్తతలు తలెత్తాయి. మొత్తంమీద చెదురుముదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పలు పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియ నెమ్మదించడంతో ఓటర్లు గంటల తరబడి క్యూలైన్లలో నిరీక్షించాల్సి వచ్చింది. చాలాచోట్ల పోలీసు భద్రత లేక పోలింగ్ కేంద్రాల్లోకి టీడీపీ, వైసీపీ శ్రేణులు చొచ్చుకొచ్చాయి. సాయంత్రానికి అన్ని నియోజకవర్గాల్లో 70 శాతంకన్నా అధికంగా పోలింగ్ నమోదైంది. చివరకు 80 శాతం వరకు నమోదైనట్లు సమాచారం.



పుట్టపర్తిలో ఓటు వేసిన కలెక్టర్ అరుణ్‌బాబు దంపతులు

మొరాయించిన ఈవీఎంలు

చిలమత్తూరు: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా పలుచోట్ల ఈవీఎంలు మొరాయించాయి. దీంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. వెరసి ఓటర్లు ఇబ్బంది పడ్డారు. మండలంలోని కోడూరులోని బూత్ నంబర్ 227లో ఈవీఎం పనిచేయలేదు. దాంతో ఉదయం 7 గంటలకు ప్రారంభం కావాల్సిన పోలింగ్ 8.30 గంటలకు మొదలైంది. అప్పటికే వందలాది మంది ఓటర్లు ఆ బూత్‌లో క్యూ కట్టారు. తోపులాటలతో ఇబ్బంది పడ్డారు. ఈ బూత్ పరిధిలో కోట్లోపల్లి, చిన్నప్పరెడ్డిపల్లి, కోడూరు ఎస్సీ కాలనీలో సగభాగం, ముద్దప్పల్లి, తుమ్మలకుంట గ్రామాలకు చెందిన 1349 మంది ఓటర్లను ఒకేచోట కలపడంతో ఉదయం నుంచి సాయంత్రం పోలింగ్ సమయం ముగిసేవరకు ఓటర్లతో కిటకిటలాడింది. పోలింగ్ సరళి కూడా మందకొడిగా సాగడంతో ఓటర్లు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. పాతచామలపల్లిలో కూడా పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది.



కోడూరులోని 227వ పోలింగ్ బూత్‌లో ఈవీఎం పనిచేయక క్యూలైన్‌లో వేచివున్న ఓటర్లు



ముదిగుబ్బలో వర్షంలో గొడుగులతో ఓటు వేసేందుకు వెళ్తున్న మహిళలు



కొత్తచెరువులో బారులు తీరిన మహిళా ఓటర్లు



వైసీపీ నాయకులు పంపిణీ చేసిన దొంగనోటు

ఓటర్లకు దొంగనోట్లు

బుక్కపట్నం: ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని అధికార పార్టీ అడ్డదారులు తొక్కింది. ఓటర్లను విపరీతంగా ప్రలోభపెట్టింది. డబ్బు పంపకాలు చేపట్టింది. విచిత్రమేమిటంటే అందులోనూ మోసం చేసింది. మండలంలోని కొండాపురంలో ఆదివారం రాత్రి వైసీపీ నాయకులు.. వలంటీర్ల ద్వారా ఓటర్లకు డబ్బు పంచారు. అందులో వారు పంపిణీ చేసిన రూ.500 నోట్లులో కొన్ని నకిలీవని తేలింది. సోమవారం వాటిని చూసుకున్న ఓటర్లు దొంగనోట్లు అని తేలడంతో లబోదిబోమంటున్నారు.

వైసీపీ సేవలో ఓపీఓ

ఫ్యాన్‌కు ఓటేయాలని ఓటర్లకు సూచన

టీడీపీ ఆందోళన



పోలీసు వాహనం వద్ద ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులు

తనకల్లు: మండలంలోని కోటపల్లి పంచాయతీలోని దేవళం తండాలోని పోలింగ్ కేంద్రంలో ఓపీఓ సరస్వతి.. వైసీపీకి ఓటేయాలని ఓటర్లకు చెప్పడంతో వివాదం తలెత్తింది. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని పోలింగ్ బూత్‌లోని వచ్చే ఓటర్లకు చెప్పారు. బయటకు వెళ్లిన ఓటర్లు విషయం టీడీపీ నాయకులకు తెలిపారు. వారు నిరసనకు దిగారు. పోలింగ్ కేంద్రం వద్దకు వెళ్లడానికి ప్రయత్నించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు గుంపును చెదరగొట్టే ప్రయత్నంలో ఇద్దరు టీడీపీ కార్యకర్తలపై చేయిచేసుకున్నారు. దీంతో ఆగ్రహించిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ఓపీఓ సరస్వతిని విధుల నుంచి తొలగించాలని పట్టుబట్టారు. ఆమెను పోలింగ్ కేంద్రం నుంచి బయటకు పంపడంతోసమస్య సద్దుమనిగి ఓటింగ్ కొనసాగింది.

ఓటర్లపై పోలీసుల జులుం

గాండ్లపెంట: మండలంలోని రెక్కమాను గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో పోలీసులు.. ఓటర్లపై జులుం ప్రదర్శించారు. 174వ పోలింగ్ కేంద్రం పరిధిలో 1400కిపైగా ఓటర్లున్నారు. దీంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు... టీడీపీ ఓటర్లను అడ్డుకుని, వారిపై దాడి చేశారు. దీంతో ఒకరు గాయపడ్డారు. దీనిపై పోలింగ్ కేంద్రం వద్దకెళ్తే పోలీసులు తమపైనే దాడి చేశారని బాధితులు వాపోయారు. పోలీసుల తీరును నిరసిస్తూ రోడ్డుపై బైఠాయించి, ఆందోళన వ్యక్తంచేశారు.



టీడీపీ ఓటర్లపై లాఠీచార్జి చేస్తున్న పోలీసులు

సొమ్మసిల్లిన వృద్ధురాలు

గాండ్లపెంట: మండలంలో పలు పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. కొన్నిచోట్ల మహిళలు, పురుషులకు ప్రత్యేక క్యూలైన్లు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో గంటలకొద్దీ క్యూలైన్లలో ఓటర్లు వేచి ఉండడంతో పాటు, ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డారు. రెక్కమాను పోలింగ్ కేంద్రంలో ఓ వృద్ధురాలు గంటలతరబడి క్యూలో ఉండడంతోపాటు తోపులాట జరగడంతో సొమ్మసిల్లి పడిపోయింది. అక్కడున్న పోలీసులు, ఓటర్లు ప్రథమచికిత్స చేశారు.



పడిపోయిన వృద్ధురాలు

దటీజ్ బాలయ్య..

ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ఓటు వేసేందుకు లైన్‌లో రావడమే అత్యంత అరుదు. నేరుగా వెళ్లిపోతుంటారు. ఎమ్మెల్యేగా కొనసాగుతూ మళ్లీ ఎన్నికల బరిలో నిలిచిన వారి గురించి చెప్పక్కర్లేదు. హిందూపురం ఎమ్మెల్యే, సినీహీరో నందమూరి బాలకృష్ణ తీరు మాత్రం అందుకు విరుద్ధం. సినిమా స్టార్ అయినా, వరుసగా రెండుసార్లు గెలిచి మూడోసారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నా బాలయ్య మాత్రం సాధారణ ఓటరులానే పోలింగ్ కేంద్రం వద్ద వ్యవహరించారు. సతీమణి వసుంధరాదేవితో కలిసి నందమూరి బాలకృష్ణ ఓటు వేసేందుకు హిందూపురంలోని ఆర్టీసీ కాలనీ ఏర్పాటు చేసిన 42వ పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. బాలయ్య నేరుగా వెళ్లకుండా క్యూలైన్‌లోకి వచ్చారు. సతీమణి వసుంధరాదేవి కూడా బాలయ్య వెనకాలే ఉన్నారు. అక్కడ పురుషులు, మహిళలకు వేర్వేరు క్యూలైన్లు ఉన్నాయి. దీనిని గమనించిన ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ.. సతీమణి వసుంధరాదేవితో 'మీరు నాలైన్‌లో రాకండి. మహిళల క్యూలో వెళ్లండి' అని సూచించారు. దీంతో ఆమె మహిళలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యూలైన్‌లోకి వెళ్లారు. బాలయ్య నిబద్ధతను చూసి అక్కడున్నవారు ఆశ్చర్యపోయారు.

-హిందూపురం



మహిళల లైన్‌లో రావాలని సతీమణి వసుంధరాదేవికి సూచిస్తున్న ఎమ్మెల్యే బాలయ్య

మాజీ ఎంపీపీపై హత్యాయత్నం

కారు ధ్వంసం

కదిరి: తలుపుల మండలంలోని పెద్దన్నవారిపల్లిలో వైసీపీ నాయకుడు పూల శ్రీనివాసరెడ్డి దౌర్జన్యానికి దిగాడు. మాజీ ఎంపీపీ, టీడీపీ నాయకుడు విజయేంద్రరెడ్డిపై హత్యాయత్నం చేశాడు. పోలింగ్ బూత్ వద్ద విజయేంద్రరెడ్డి కారులో ఉండగా.. పూల శ్రీనివాసరెడ్డి తన వర్గీయులతో వచ్చి దాడి చేశాడు. ఆయన కారుపై అకారణంగా దాడిచేసి, ధ్వంసం చేశారు. కారులో ఉన్న విజయేంద్రరెడ్డిని చంపడానికి యత్నించినట్లు బాధితుడు చెప్పారు. తలుపుల ఎస్ఐ దిలీప్‌కుమార్ సమయానికి రాకపోతే తనను చంపేసేవారన్నారు. కుర్లి పోలింగ్ బూత్‌లో దొంగ ఓట్లు వేస్తున్న వైసీపీ నాయకుడు శివారెడ్డిని అడ్డుకున్నందుకు టీడీపీ నాయకుడు సుదర్శన్‌రెడ్డిపై మూకదాడి చేశారు. కదిరి పట్టణంలోని చావిడి వెనుక ఉన్న పోలింగ్ కేంద్రంలో వైసీపీకి చెందిన పలువురు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని కూటమి అభ్యర్థి కందికుంటప్రసాద్.. సీఐ పుల్లయ్యకు ఫిర్యాదు చేశారు. కుటాగుళ్లలో పోలీసులపై సురేష్‌రెడ్డి అనే వ్యక్తి దాడి చేసినట్లు సమాచారం. గాండ్లపెంట మండలంలోని రెక్కమానులో సర్పంచ్ సుధాకర్‌రెడ్డిపై పోలీసులు జులుం ప్రదర్శించారు.

ధ్వంసమైన కారు



కొత్తకోటలో టీడీపీ నాయకులపై దాడి

బుక్కపట్నం: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో భాగంగా మండలంలోని కొత్తకోటగ్రామంలో వైసీపీ నాయకులు దాష్టీకానికి పాల్పడ్డారు. టీడీపీకి చెందిన రమేష్, చంద్రను వైసీపీ నాయకులు సురేష్, కేశవ దాడిచేసి, తీవ్రంగా గాయపరిచారు. ఓటు వేసి ఇంటికెళ్తుండగా వైసీపీ మద్దతు సర్పంచ్ నాగమని ఇంటిముందు టీడీపీ నాయకులపై విచక్షణరహితంగా దాడి చేసి, గాయపరిచారు. క్షతగాత్రులను పెనుకొండకు తరలించారు.

దాడులు.. దౌర్జన్యాలు..

పోలింగ్ సందర్భంగా వైసీపీ మూకల దాష్టీకం

- టీడీపీ నాయకులపై దాడులు
- పోలీసుల ప్రేక్షకపాత్ర
- భయభ్రాంతులకు లోనైన ఓటర్లు



గాయపడిన టీడీపీ నాయకుడు బాబురెడ్డి



బాబురెడ్డిపై దాడి చేస్తున్న వైసీపీ నాయకులు

చిలమత్తూరు, మే 13: సార్వత్రి ఎన్నికల పోలింగ్ సందర్భంగా సోమవారం జిల్లాలో పలుచోట్ల వైసీపీ మూకలు దాడులు, దౌర్జన్యాలకు దిగాయి. టీడీపీ నాయకులపై విచక్షణారహితంగా దాడులు చేశాయి. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు అక్కడే ఉన్నా.. అడ్డుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చిలమత్తూరు మండలం హుసేన్‌పురం గ్రామంలో టీడీపీ నాయకులపై వైసీపీ మూకలు దాడులు చేశాయి. హుసేన్‌పురానికి చెందిన టీడీపీ నాయకుడు బాబురెడ్డి తీవ్రంగా గాయపడగా, మరికొంతమందికి స్వల్పగాయాలయ్యాయి. ఉదయం పోలింగ్ ప్రారంభం కాగానే దాదిరెడ్డిపల్లి తండా వద్ద వైసీపీ ఎంపీపీ పురుషోత్తంరెడ్డి తన అనుచరులతో ఓటర్లను ప్రలోభపెడుతున్న విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు అక్కడికి వెళ్లి అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో రెచ్చిపోయిన ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, అతడి అనుచరులు గ్రామంలోకి వచ్చి పోలింగ్ స్టేషన్‌కి కూతవేటు దూరంలో టీడీపీ నాయకులపై విచక్షణారహితంగా దాడులకు పాల్పడ్డారు. టీడీపీ నాయకుడు బాబురెడ్డిని గ్రామ వీధుల్లో తరిమితరిమి కొట్టారు. ఈ దాడుల్లో అతడి తలకు తీవ్ర గాయమైంది. అక్కడున్న మహిళలపై కూడా దాడి చేశారు. ఇంతస్థాయిలో దాడులు చేస్తున్నా.. అక్కడే ఉన్న పోలీసులు ప్రేక్షకపాత్ర పోషంచడం శోచనీయం. దాడుల్లో గాయపడిన వారిని ఆస్పత్రికి తీసుకెళ్లడానికి కూడా పోలీసులు ముందుకు రాలేదు. విషయం తెలుసుకున్న డీఎస్పీ కంజక్షన్ అక్కడికి చేరుకుని, ఇరువర్గాలను చెదరగొట్టారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటుచేశారు. ఊరిలో కొత్త వ్యక్తులు ఎవరూ ఉండరాదని హెచ్చరికలు జారీ చేశారు. ప్రతి ఇంట్లో తనిఖీలు చేస్తూ కొత్త వ్యక్తులను బయటకు పంపించేశారు. ఈ దాడులతో ఓటర్లు భయభ్రాంతులకు లోనయ్యారు. మధ్యాహ్నం తరువాత ఉద్రిక్తతలు తగ్గడంతో ఓటర్లు ఒక్కొక్కరుగా వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. హుసేన్‌పురంలోని బూత్ నంబర్ 151లో టీడీపీకి ఎక్కువ మెజార్టీ వస్తుందనే ఎంపీపీ పురుషోత్తంరెడ్డి.. తన అనుచరులతో తమపై దాడులు చేశాడని గాయపడిన బాబురెడ్డి పేర్కొన్నారు. పోలీసులు కనీసం దాడులను ఆపే ప్రయత్నం చేయలేదనీ, ఏకపక్షంగా వ్యవహరించారని ఆరోపించారు.

ఎం.చెర్లోపల్లిలో..

బత్తలపల్లి: మండలంలోని ఎం.చెర్లోపల్లిలోని పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ వర్గీయులపై వైసీపీ మూకలు దాడి చేశాయి. దీంతో టీడీపీకి చెందిన దురగమప్ప, బాలకృష్ణ గాయపడ్డారు. బాలకృష్ణ బంధువులు సెల్‌ఫోన్లతో ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లారు. అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు వచ్చి దాడి చేస్తుండగా మరో టీడీపీ నాయకుడు దురగమప్ప అడ్డుకోబోయారు. అతడిపై కూడా వైసీపీ నాయకులు దాడి చేసి, గాయపరిచారు. బాధితులను గ్రామస్థులు బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.



వైసీపీ నాయకుల దాడిలో గాయపడిన టీడీపీ నాయకులు

మాజీమంత్రిని అడ్డుకున్న వైసీపీ నాయకులు



పల్లెను అడ్డుకుంటున్న వైసీపీ నాయకులు

నల్లమాడ: మండలంలోని నల్లశింగయ్యగారిపల్లిలోని ప్రాథమిక పాఠశాల పోలింగ్‌కేంద్రంలోకి మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి వెళ్తుండగా వైసీపీ నాయకులు అడ్డుకున్నారు. పల్లె వెంట వచ్చిన టీడీపీ నాయకులతో వైసీపీ నాయకులు తీవ్రస్థాయిలో వాగ్వాదానికి దిగారు. పోలీసులు ఎట్టకేలకు మాజీ మంత్రి పల్లెను పోలింగ్ కేంద్రంలోకి తీసుకెళ్లారు. అనంతరం బయటకు వస్తున్న పల్లెను ఉద్దేశించి, నినాదాలు చేశారు. ఓటర్లు ఇది సరైన పద్ధతికాదని అసహనం వ్యక్తం చేశారు.

చోళసముద్రంలో లాఠీచార్జి

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం గ్రామంలో స్వల్ప ఉద్రిక్తత తలెత్తింది. బందోబస్తు తక్కువగా ఉండటంతో కొంతమంది పోలీసుల మధ్య వాగ్వాదం తలెత్తింది. దీంతో ఓ పోలీసు.. అక్కడే ఉన్న వ్యక్తిపై చేయిచేసుకున్నారు. ఇదే అదునుగా భావించి, అక్కడున్న ఇరువర్గాలు ఘర్షణకు దిగాయి. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని లాఠీచార్జి చేసి, ఇరువర్గాలను చెదరగొట్టారు. తర్వాత పోలింగ్ కొనసాగింది.

పలుచోట్ల ఘర్షణలు

నల్లమాడ: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఘర్షణలు జరిగాయి. చౌటకంటపల్లి పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ, టీడీపీ నాయకులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నాలుగైదుమార్లు ఘర్షణ పడ్డారు. పరస్పరం దూషించుకున్నారు. కురమాల, రెడ్డిపల్లి, చారుపల్లి, తదితర పోలింగ్ కేంద్రాల వద్ద చెరురుమదురు ఘటనలు తలెత్తాయి. పోలీసుల రంగప్రవేశంతో ఓటింగ్ ప్రశాంతంగా సాగింది.



చౌటకుంటపల్లిలో ఘర్షణ పడుతున్న వైసీపీ, టీడీపీ వర్గీయులు

ధర్మవరం	
మొత్తం ఓటర్లు	2,45,758
పోలింగ్ శాతం	76.10

రాయదుర్గం	
మొత్తం ఓటర్లు	2,64,352
పోలింగ్ శాతం	77.06

అనంతపురం	
మొత్తం ఓటర్లు	2,81,214
పోలింగ్ శాతం	64.5

ఉరవకొండ	
మొత్తం ఓటర్లు	2,24,339
పోలింగ్ శాతం	80.4

గుంతకల్లు	
మొత్తం ఓటర్లు	2,70,648
పోలింగ్ శాతం	71.56

తాడిపత్రి	
మొత్తం ఓటర్లు	2,48,880
పోలింగ్ శాతం	77.58

శింగనమల	
మొత్తం ఓటర్లు	2,47,373
పోలింగ్ శాతం	80.13

కళ్యాణదుర్గం	
మొత్తం ఓటర్లు	2,30,785
పోలింగ్ శాతం	79.4

రాప్తాడు	
మొత్తం ఓటర్లు	2,50,571
పోలింగ్ శాతం	81.41

పుట్టపర్తి	
మొత్తం ఓటర్లు	2,11,062
పోలింగ్ శాతం	70

కదిరి	
మొత్తం ఓటర్లు	2,53,420
పోలింగ్ శాతం	81.37

మడకశిర	
మొత్తం ఓటర్లు	2,11,074
పోలింగ్ శాతం	74.25

హిందూపురం	
మొత్తం ఓటర్లు	2,49,174
పోలింగ్ శాతం	73.32

పెనుకొండ	
మొత్తం ఓటర్లు	2,35,986
పోలింగ్ శాతం	79.77

అనంతపురం



రాప్తాడు మండలం బండమీదపల్లిలో ఓటుహక్కును వినియోగించుకున్న అనంతపురం అర్బన్ టీడీపీ అభ్యర్థి దగ్గుబాటి, నగరంలో వైసీపీ అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డి

శింగనమల



సిద్దరాంపురంలో ఓటుహక్కును వినియోగించుకున్న టీడీపీ అభ్యర్థి శ్రావణిశ్రీ, సి.బండమీదపల్లిలో వైసీపీ అభ్యర్థి వీరాంజినేయులు

రాప్తాడు



నసనకోటలో ఓటుహక్కును వినియోగించుకున్న టీడీపీ అభ్యర్థి పరిటాల సునీత, తోపుదుర్తిలో వైసీపీ అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ధర్మవరం



అనంతపురం రుద్రంపేట పంచాయతీ పంతుల కాలనీలో ఓటు వేసిన ధర్మవరం బీజేపీ అభ్యర్థి సత్యకుమార్, ధర్మవరంలో వైసీపీ అభ్యర్థి కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

హమ్మయ్యా.. అయిపోయింది..!

ప్రజాతీర్పు యంత్రాల్లో నిక్షిప్తమైంది. ఎవరికి అనుకూలంగా ఉంటుందోనన్న ఉత్కంఠ కొన్నాళ్లు కొనసాగుతుంది. పోటీలో ఎందరున్నా.. కీలక పోరు టీడీపీ కూటమి, వైసీపీ అభ్యర్థుల మధ్యనే ఉంటుందన్నది తేటతెల్లం. కాంగ్రెస్ ఓటు బ్యాంకు కాస్త పెరిగినట్లు కనిపిస్తోంది. ఫలితాలు జూన్ 4న బహిర్గతమౌతాయి. అంతవరకూ తమదే గెలుపు అని ఊహల్లో తేలిపోవచ్చు. ఏమౌతుందోనని ఉత్కంఠ ఎదుర్కోవచ్చు. ఓటర్లది సైతం ఇదే పరిస్థితి. ఆ రోజు కోసం ఎదురు చూస్తూ.. రోజులు లెక్కబెట్టడం మొదలైంది. ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లో అభ్యర్థులు, ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

- అనంతపురం న్యూస్‌నెట్‌వర్క్

పుట్టపర్తి



పుట్టపర్తిలో ఓటు వేసిన టీడీపీ అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి, నల్లమాడ మండలంలో వైసీపీ అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

కదిరి



కదిరిలో ఓటు వేసిన టీడీపీ అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్, షాహీపేట పాఠశాలలో వైసీపీ అభ్యర్థి మక్బూల్

కళ్యాణదుర్గం



కళ్యాణదుర్గంలో ఓటు హక్కు వినియోగించుకున్న టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు, వైసీపీ అభ్యర్థి తలారి రంగయ్య

తాడిపత్రి



తాడిపత్రిలో ఓటు వేసిన టీడీపీ అభ్యర్థి జేసీ అస్మిత్‌రెడ్డి, వైసీపీ అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డి

ఉరవకొండ



ఉరవకొండలో ఓటు వేస్తున్న టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్, వైసీపీ అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి

గుంతకల్లు



ఓటు వేసిన టీడీపీ అభ్యర్థి గుమ్మనూరు జయరాం, వైసీపీ అభ్యర్థి వై.వెంకటరామిరెడ్డి

పెనుకొండ



ఓటు వేసిన టీడీపీ అభ్యర్థి సవిత, వైసీపీ అభ్యర్థి ఉషశ్రీచరణ్

మడకశిర



ఓటు వేసిన టీడీపీ అభ్యర్థి ఎంఎస్ రాజు, వైసీపీ అభ్యర్థి ఈరలక్కప్ప

రాయదుర్గం



ఓటు వేసిన టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు, వైసీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి

హిందూపురం



హిందూపురంలో ఓటుహక్కును వినియోగించుకున్న టీడీపీ అభ్యర్థి నందమూరి బాలకృష్ణ, వైసీపీ అభ్యర్థి దీపిక

పార్లమెంట్



హిందూపురం పార్లమెంటు పరిధిలో ఓటుహక్కును వినియోగించుకున్న టీడీపీ అభ్యర్థి బీకే పార్థసారథి, అనంతపురం పరిధిలో వైసీపీ అభ్యర్థి శంకర్‌నారాయణ

అందరికీ థ్యాంక్స్: కలెక్టర్



అనంతపురం టౌన్: జిల్లాలో ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్ సోమవారం రాత్రి ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2,236 పోలింగ్‌కేంద్రాలలో ఎన్నికలు నిర్వహించామన్నారు. ప్రతి కేంద్రంలోను వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసి జిల్లా కమాండ్ కంట్రోల్ నుంచి తెల్లవారుజాము నుంచే పర్యవేక్షించారు. ఎన్నికలు ఇంత విజయవంతంగా జరగడానికి ఎన్నికల పరిశీలకులు, రెవెన్యూ, పోలీస్‌శాఖల అధికారులు, నోడల్ అధికారులు, రిటర్నింగ్ ఆఫీసర్లు, ఏఆర్‌ఓలు, పోలింగ్ సిబ్బంది, కేంద్రబలగాలుతో పాటు ఓటర్లు, రాజకీయపార్టీల సహకారం ఎంతో ఉందన్నారు. అందుకే ప్రతి ఒక్కరికీ జిల్లా ఎన్నికల కమిషన్ తరపున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు తెలిపారు. ఇదే స్ఫూర్తితో అధికారులు, సిబ్బంది పని చేసి ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయబంతం చేద్దామని కలెక్టరు కోరారు.



హిందూపురంలో వర్షంలో గొడుగులు పట్టుకుని ఓటు కోసం క్యూలో ఉన్న ఓటర్లు



ఓటు హక్కు వినియోగించుకున్న గోనుగుంట్ల సూర్యనారాయణ, కుటుంబ సభ్యులు, మాజీ మంత్రి రఘువీరారెడ్డి, కుటుంబ సభ్యులు, జేసీ ప్రభాకర్‌రెడ్డి తదితరులు



ఓటు వేసిన గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే సుధాకర్, సీపీఐ రామకృష్ణ, చిలకం మధుసూదనరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఈరన్న, టీడీపీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ జీవీ వెంకటరాముడు

ఓటు కోసం స్వదేశానికి..

గుంతకల్లుటౌన్: విదేశాల నుంచి వచ్చిన పలువురు ఎన్‌ఆర్‌ఐలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో సోమవారం సార్వత్రిక ఎన్నికల కార్యక్రమం సజావుగా జరిగింది. ఉదయం 7 గంటలకే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం చినుకులు పడటంతో పోలింగ్‌కు ఓటర్లు క్యూకట్టారు.


రాష్ట్ర అభివృద్ధి కోసం ఓటు వేశాం



మాకు డల్లాస్ రాష్ట్రంలో సాఫ్ట్‌వేర్ కంపెనీ ఉంది. ఓటు వేసేందుకు అక్కడి నుంచి అమీన్‌పల్లి గ్రామానికి వచ్చాము. 30 సంవత్సరాల తరువాత ఓటు హక్కు వినియోగించుకున్నాము. మన రాష్ట్రానికి రాజధాని లేదు, నిరుద్యోగాలకు ఉద్యోగ అవకాశాలు లేవు. రాష్ట్ర అభివృద్ధి కోసం, రాష్ట్రానికి మంచి పరిపాలన అందించే నాయకుడు కావాలి. అందుకోసం తాము ప్రత్యేకంగా ఒక్కరోజు ముందు 5 వేల డాలర్లు చెల్లించి టికెట్ బుక్‌చేసుకుని గ్రామానికి వచ్చి ఓటు వేశాం.

రాయల్ శివప్రసాద్, కార్తీక దాసరి దంపతులు, డల్లాస్ రాష్ట్రం, యూఎస్.


రాష్ట్ర అభివృద్ధే మా ఆకాంక్ష



సింగపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా ఉద్యోగం చేస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు ఓటు వేసేందుకు సింగపూర్ నుంచి మా స్వగ్రామం అమీన్‌పల్లికి వచ్చాం. రాష్ట్రానికి మంచి పాలన అందించే నాయకుడు కావాలి. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నదే మా ఆకాంక్ష.

మల్లికార్జున, సౌజన్య దంపతులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సింగపూర్

ఓటు వేసిన ఎన్‌ఆర్‌ఐ



రొద్దం: మండలంలోని చిన్నమంతూరుకు చెందిన ఎన్‌ఆర్‌ఐ సురేంద్రనాథ్ చౌదరి సోమవారం గ్రామంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. అమెరికా నుంచి వచ్చి ఓటు వేసేందుకు వచ్చినట్లు ఆయన తెలిపారు.

అధికారం రానీ ... మీ కథ చూస్తా...!

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి బెదిరింపులు



బీకేఎస్‌లో పోలింగ్ కేంద్రంలో జొన్నలగడ్డ పద్మావతి

బుక్కరాయసముద్రం, మే 13: 'అధికారం రానీ.. మీ కథ చూస్తా' అని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి టీడీపీ కార్యకర్తలను బెదిరించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా బీకేఎస్ ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఉన్న టీడీపీ నేతలను చూసి ఆమె రెచ్చిపోయింది. ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన 141 పోలింగ్ కేంద్రంలో ఒక్క ఓటు కోసం టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య వివాదం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి నిబంధనలకు విరుద్ధంగా తన అనుచరులతో పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించింది. గెలిచేది తమ పార్టీనేనని, అధికారంలోకి వచ్చాక మీ కథ చూస్తానంటు టీడీపీ కార్యకర్తలను బెదిరించారు. టీడీపీ వారికి మద్దతుగా వ్యవహరిస్తున్నారంటూ ఎన్నికల సిబ్బందిపై చిందులు వేశారు.

కేసు నమోదు చేయండి

ఎన్నికల నిబంధనలు ఉల్లఘించి పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి, ఎన్నికల సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతిపై కేసు నమోదు చేయాలని ద్విసభ్యకమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, కన్వీనర్ అశోక్ డిమాండ్ చేశారు. ఈ విషయం మీద ఎంపీడీఓ శోభారాణితో వాగ్వాదానికి దిగారు. పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చి టీడీపీ కార్యకర్తలపై దూషణలకు దిగడం పద్మావతికి తగదన్నారు.



ఎంపీడీఓపై మండిపడుతున్న కేశవరెడ్డి, రామలింగారెడ్డి



సాయంత్రం 5.45 గంటలైనా క్యూ లైన్‌లో భారీగా ఓటర్లు, నీరసించి కింద కూర్చుండి పోయిన ఓటర్లు

మంత్రి ఉష హల్‌చల్..!

హిందూపురం అర్బన్, మే 13: వైసీపీ పెనుకొండ అభ్యర్థి, మంత్రి ఉష శ్రీచరణ్ పరిగిలో హల్‌చల్ చేశారు. సాధారణ ఓటర్లకు అధికారులు సెల్ ఫోన్లు అనుమతించలేదు. కానీ మంత్రి రాగానే వైసీపీ శ్రేణులు పెద్ద ఎత్తున్న నినాదాలు చేస్తూ ఆమె వెంట నడిచారు. పోలింగ్ కేంద్రం వద్ద ఫొటోలు తీసుకున్నారు. వారి తీరును ప్రశ్నించిన ఓటర్లకు ఉషశ్రీ చరణ్ వేలు చూపుతూ బెదిరించారు. పైడేటి పోలింగ్ కేంద్రం తలుపులు మూసివేయించి దాదాపు 15 నిమిషాలు ఆమె లోపలే ఉండిపోయారు. దీంతో టీడీపీ నాయకులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండే ఎండలో ఇబ్బంది పడుతున్న ఓటర్లు మంత్రిని నిలదీయడంతో వైసీపీ మూకలు గొడవకు దిగాయి. దీంతో కొద్దిపాటి ఉద్రిక్తత ఏర్పడింది. డీఎస్పీ బాజీజాన్ సైదా, సీఐ, ఎస్ఐ సీఆర్‌పిఎఫ్ బలగాలు అక్కడికి చేరుకుని పరిస్థితి చక్కదిద్దారు.

పోలింగ్ నిర్వహణలో ఎస్పీ విఫలం

పోలీసు అధికారుల తీరుపై సత్యకుమార్ ఆగ్రహం



మాట్లాడుతున్న సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, మే 13: శ్రీ సత్యసాయి జిల్లాలో పోలింగ్ నిర్వహణలో ఎస్పీ, ధర్మవరంలో డీఎస్పీ, సీఐలు పూర్తిగా విఫలమయ్యారని కూటమి అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ మండిపడ్డారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలీసు సిబ్బంది, ఎన్నికల అధికారులు ఏకపక్షంగా వ్యవహరించినా ప్రజలు మాత్రం వాటిని తిప్పి కొట్టి పెద్ద ఎత్తున ఓటింగ్‌లో పాల్గొన్నారన్నారు. ధర్మవరానికి చెందిన కొందరు ఆకు రౌడీలు విజృంభిస్తున్నా పోలీసు అధికారులు ప్రేక్షకపాత్ర వహించడం సిగ్గుచేటన్నారు. రౌడీ షటర్లు అయిన సుధాకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జయరామిరెడ్డి, వినయ్‌గౌడ్, మారుతి, కేశవరెడ్డి తదితరులు ఓటర్లను బెదిరించారన్నారు. సమావేశంలో జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదనరెడ్డి, నాయకులు చందారాఘవ, గిర్రాజు నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

భావితరాల కోసం ఓటరు తీర్పు

విలేకరుల సమావేశంలో నందమూరి బాలకృష్ణ

హిందూపురం, మే 13 : చీకటిగా ఉన్న ఈ రాష్ట్రం మార్పు కోసం, భావితరాల కోసం ఓటరు తీర్పు ఇవ్వనున్నారని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. సోమవారం హిందూపురంలో ఆర్టీసీ కాలనీలో బాలకృష్ణ దంపతులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓటరుతీర్పే భావితరాల భవిష్యత్ కోసం అన్నారు. మీరు వేసే ఓటు మీ కోసం మీ పిల్లల కోసమన్నారు. ప్రజాతీర్పు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు దోహదపడుతుందన్నారు. అధోగతి పాలైన రాష్ట్రాన్ని పునర్‌నిర్మించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎన్నడూ లేనివిధంగా దేశ విదేశాల్లో ఉన్నవారు సైతం ఓటు వేసేందుకు వచ్చారని పేర్కొన్నారు. ఈ రాష్ట్రం బాగుపడాలనే ఉద్దేశ్యంతోనే వారంతా ఓటు కోసం స్వగ్రామానికి వచ్చారని అన్నారు. ఉద్యోగులు ఎంతో ఇబ్బంది పడ్డారని, అందుకే వారు కూడా మార్పు కోరుతున్నారని వివరించారు. మూడోసారి హిందూపురంలో అధిక మెజార్టీ ఇస్తారని బావిస్తున్నా అన్నారు తెలుగుదేశం పార్టీ గెలుపు లాంఛనమే అన్నారు. ప్రజాస్వామ్యదేశంలో బలమైన ఆయుధం ఓటే అన్నారు.

ఓటు వేసేందుకు పోటెత్తిన ఓటర్లు

● ఉదయం నుంచే కేంద్రాల వద్ద బారులు తీరిన వైనం




దుర్గానగర్ ప్రభుత్వ పాఠశాల, ఇందిరమ్మకాలనీలోని పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లు




చంటిబిడ్డలతో ఓటు వేయడానికి క్యూలో నిల్చున్న మహిళలు



ఓ పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు నమస్కరిస్తున్న సత్యకుమార్

ధర్మవరం, మే 13: ధర్మవరం మున్సిపాలిటీ పరిధిలో సోమవారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ చెదురుముదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా జరిగింది. ఉదయం 6గంటలకే ప్రజలు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఎండ వేడిమికి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మున్సిపాలిటీలో పరిధిలోని ఓటర్లు 105 కేంద్రాలలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు లేకపోవడంతో అధికారులు, ప్రజలు కూడా ఇబ్బందులు పడ్డారు. పోలింగ్ కేంద్రాల వద్ద కూటమి, వైసీపీ శ్రేణులు తమ అభ్యర్థులకు ఓట్లు వేయించడానికి ఎవరిప్రయత్నాలు వారు చేశారు. వృద్ధులు, వికలాంగులను ఆటోలు, ద్విచక్రవాహనాలలో పిలుచుకొచ్చి ఓట్లు వేయించారు. కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ నాయకులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తుండగా.. విషయం తెలుసుకున్న సీఐలు సుబ్రమణ్యం, అశోక్‌కుమార్ వారిని అక్కడి నుంచి పంపించారు. ధర్మవరం పట్టణంలో 225వ, 227వ పోలింగ్ బూత్‌లలో ఈవీఎంలు నిదానంగా పనిచేయడంతో సాయంత్రం 5:30గంటలైనా ఓటర్లు బారులు తీరారు. దీంతో ఓటింగ్ సరళి ఆలస్యంగా సాగింది. అదేవిధంగా లక్ష్మీనగర్‌లో కూడా ఈవీఎంలు సక్రమంగా పనిచేయకపోవడంతో అక్కడ కూడా ఆలస్యమైంది. ఓటర్లు క్యూలో నిలబడలేక తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. 27వ వార్డులోని 232వ పోలింగ్ బూత్‌లో ఓటర్లు, పోలింగ్ సిబ్బంది మధ్య తోపులాట జరిగింది. అదేవిధంగా పలు కేంద్రాల్లో కూటమి శ్రేణులు, వైసీపీ ఏజెంట్ల మధ్య చిన్నచిన్న గొడవలు జరిగాయి. మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ మందకొడిగా సాగింది. ఆ తరువాత పుంజుకుంది. ఎన్నికల సందర్భంగా పట్టణంలో దుకాణాలు బంద్ చేశారు. దీంతో పట్టణమంతా నిర్మానుష్యంగా మారింది. డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీఐలు సుబ్రమణ్యం, అశోక్‌కుమార్, ఎస్ఐ శ్రీనివాస్ పోలింగ్ కేంద్రాల వద్ద గట్టిపోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, కూటమి బీజేపీ అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ పోలింగ్ కేంద్రాల వద్ద పర్యవేక్షించారు. పట్టణంలోని 243వ పోలింగ్ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ, 201వ పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, 219వ పోలింగ్ కేంద్రంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, 193వ పోలింగ్ కేంద్రంలో కాంగ్రెస్ అభ్యర్థి రంగన అశ్వర్థనారాయణ తన కుటుంబసభ్యులతో కలిసి ఓటుహక్కును వినియోగించుకున్నారు.

మొరాయించిన ఈవీఎంలు

● చాలాచోట్ల ఆస్యంగా ప్రారంభమైన పోలింగ్

ఓబుళదేవరచెరువు, మే 13: మండల వ్యాప్తంగా పలుచోట్ల ఓటింగ్ ప్రారంభంలోనే ఈవీఎంలు మొరాయించాయి దీంతో ఓటింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. మండల కేంద్రంలోని 209 పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు మొరాయించడంతో గంటపాటు ఆలస్యంగా ప్రారంభమైంది. అలాగే సున్నంపల్లి పోలింగ్ కేంద్రంలో టీడీపీ, వైసీపీ ఏజెంట్లు, నాయకులు వాగ్వాదంచేయడంతో అక్కడ కూడా గంటపాటు అధికారులు పోలింగ్ నిలిపివేశారు. తరువాత కొనసాగించారు. తిప్పేపల్లి, కుసుమవారిపల్లి,ఓడీచెరువుల్లో వైసీపీ వారు ఓటర్లను ప్రభావితం చేస్తున్నారని, టీడీపీ వారు నిలదీయడంతో.. కొద్దిసేపు వాగ్వివాదం చోటు చేసుకుంది.చివరకు పోలీసులు జోక్యం చేసుకుని సర్ది చెప్పారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన పల్లె సింధూర

మండలంలోని తిప్పేపల్లి, ఓడీచెరువు పోలింగ్ కేంద్రాలను కూటమి అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి సందర్శించా రు. అక్కడ ఓటింగ్ సరళిని అధికారులనడిగి తెలుసుకున్నారు.



ఓడీ చెరువు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించేందకు వచ్చిన పల్లె సింధూరారెడ్డి



చిగిచెర్లలో మొరాయించిన ఈవీఎంలను పరిశీలిస్తున్న అధికారులు

ధర్మవరం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో సార్వత్రిక ఎన్నికలలో సుమారు అరగంట పాటు ఈవీఎంలు మొరాయించాయి. చిగిచెర్ల గ్రామంలో ఉదయం 7గంటలకు ప్రారంభం కావాల్సిన పోలింగ్ 137, 138వ బూత్‌లలో ఈవీఎంలు సుమారు అరగంటపై పని చేయలేదు. దీంతో ఓటర్లు క్యూలైన్‌లో నిలిచిపోయారు. వెంటనే రూట్ ఆఫీసర్ ముస్తాఫా, పోలింగ్‌స్టేషన్ అధికారులు వాటిని సరిచేశారు. ఆ తర్వాత సజావుగా పోలింగ్ సాగింది.

బుక్కపట్నం, మండలకేంద్రలోని 41కేంద్రంలో ఈవీఎం మొరాయించడంతో దాదాపు ఒకటిన్నర గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. దీంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కదిరిలో 81.37శాతం పోలింగ్



కదిరి పట్టణంలోని కుటాగుళ్లలో బారులు తీరిన ఓటర్లు

కదిరి, మే 13: కదిరి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికలకు జరిగిన పోలింగ్‌లో 81 శాతం పైగా ఓట్లు పోలయ్యాయి. ని యోజకవర్గ వాప్తంగా ఉదయం 6 నుంచి 9గంటల వరకు కాస్త నెమ్మదిగా పోలింగ్ జరిగింది. 9గంటలకు 8.71 శాతం నమోదైంది. 11గంటలకు 25.71 శాతం నమోదుకాగా.. మధ్యాహ్నం ఒంటి గంటకు 45.83 శాతం, 3గంటలకు 56.77శాతం, సాయంత్రం 4గంటలకు 63,32శాతం, సాయంత్రం 5గంటలకు 67.92 శాతం, 6గంటలకు 72.24శాతం నమోదైనట్లు ఎన్నికలాధికారులు చెప్పారు. ఇక ఓటింగ్ పూర్తయ్యే సరికి 81.37 శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపారు. 253 420 మంది ఓటర్లకు గాను 206200 మంది ఓట్లు వేసినట్లు పేర్కొన్నారు.

ఎలాగైనా.. ఓటు వేయాలి

● నడవలేని స్థితిలో ఉన్నా ఓటేసేందుకు వచ్చిన వృద్ధురాలు



ఓటును సద్వినియోగం చేసుకున్న వృద్ధురాలు

తనకల్లు, మే 13: మండలంలోని చీకటిమానుపల్లికి చెందిన గుర్రమ్మకు 83 ఏళ్ల వయసు. నడవలేని స్థితిలో ఉన్నారు. అయినా సోమవా రం నిర్వహించిన పోలింగ్‌కు ఆమె వీల్‌చైర్‌లో వచ్చి ఓటు వేశారు. నడవలేని స్థితిలో ఉన్నా సరే.. ఎలా అయినా ఓటు వేయాలన్న తపనతో ఆమె పోలింగ్ కేంద్రం వద్దకు కుటుంబ సభ్యుల సాయంతో వీల్‌చైర్‌లో వచ్చారు. అన్నీ బాగున్న వారు, యువత ఓటింగ్‌కు రాని ఈ తరుణంలో ఆమె అందరికీ ఆదర్శంగా నిలిచారు.

తాడిమర్రిలో 90శాతం పోలింగ్



తాడిమర్రిలో బారులు తీరిన ఓటర్లు

తాడిమర్రి, మే 13: మండల వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల్లో 90శాతం పోలింగ్ నమోదైంది. మండలంలో 25, 552 మంది ఓటర్లు ఉండగా రాత్రి 8గంటల సమయానికి 23,208ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 31పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ జరిపారు. 30-ఏ పోలింగ్ బూత్‌లో 1332 మంది ఓటర్లు ఉండగా రాత్రి 9గంటలు దాటినా క్యూలో ఓటర్లు వేచి ఉన్నారు. పలు చోట్ల సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌లు, యువకులు ఉత్సాహంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీల్‌చైర్‌కు పరిమితమయిన వికలాంగులు కూడా ఓటు వేసేందుకు పోటీ పడటం విశేషం. చిన్నచిన్నసంఘటనలు తప్పా మండంలోని పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.రూరల్ సీఐ కృష్ణంరాజ్ నాయక్ , ఎస్ఐ నాగాస్వామిల ఆధ్వర్యంలో మూడు పోలింగ్ బూత్‌లలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేశారు.



ఓటు వేయడానికి వీల్‌చైర్‌లో వస్తున్న వృద్ధురాలు

మండుటెండలో బారులు తీరిన ఓటర్లు



నల్లచెరువులో మండుటెండలో బారులు తీరిన మహిళలు

నల్లచెరువు, మే 13: మండలంలో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా 28పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరిగింది. కొన్నిచోట్ల సరైన వసతులు లేకపోవడంతో ఓటర్లు మండుటెండలోనే బారులు తీరి ఓటు హక్కును వినియోగించుకున్నారు. మరికొన్నిచోట్ల చిన్న చిన్నసమస్యలతో ఘర్షలు జరిగాయి. తర్వాత పోలింగ్ కొనసాగించారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ఓటింగ్ శాతం ఉదయం 11గంటలకు 25శాతం కాగా.. మధ్యాహ్నం 1గంటలకు 44శాతం, 3 గంటలకు 61శాతం, 5గంటలకు 80శాతం ఓట్లు పోలైనట్లు ఎన్నికలాధికారులు తెలిపారు. కొన్ని కేంద్రాల్లో అధిక ఓట్లు ఉండడంతో కేంద్రం ఒకటే ఉండడం వల్ల ఓటర్లు బారులు తీరారు.

ఉదయం నుంచే.. పోలింగ్‌కేంద్రాలకు ఓటర్లు



పోతుకుంటలో బారులు తీరిన ఓటర్లు



కుణుతూరులో క్యూలైన్‌లో ఉన్నఓటర్లు

ధర్మవరం రూరల్, మే 13: మండలవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం6 గంటలకే ప్రజలు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఉదయం 7గంటల నుంచి 6గంటలకు వరకు పోలింగ్ జరిగింది. తీవ్రమైన ఎండ ఉన్నా క్యూలైన్‌లో నిలబడి ఓటుహక్కును వినిగించుకున్నారు. వృద్ధులను, వికలాంగులను ఆటోలు, ద్విచక్రవాహనాలలో పిలుచుకుని వచ్చి ఓటు వేయించారు. ఎన్నికల సందర్భంగా ధర్మవరం పట్టణంలో దుకాణాలు బంద్ చేశారు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారింది. ధర్మవరంరూరల్ ఎస్ఐ నరేంద్ర ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద గట్టిపోలీస్‌బందోబస్తు నిర్వహించారు. మండలవ్యాప్తంగా 62.2 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.



ధర్మవరంలో దుకాణాలు బంద్

బత్తలపల్లిలో 83 శాతం పోలింగ్



బత్తలపల్లిలో బారులు తీరిన ఓటర్లు

బత్తలపల్లి, మే 13: మండలవ్యాప్తంగా 83 శాతం పోలింగ్ నమోదు అయినట్లు తహసీల్దార్ శివశంకర్ నాయక్ తెలిపారు. మండల వ్యాప్తంగా 42 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ఉదయం 7 గంటలకే ప్రారంభమైంది. ఓటర్లు ఉదయం 6 గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్దకు రావడం మొదలు పెట్టారు. ఓటర్లు మధ్యాహ్న ఒంటి గంట వరకు భారీగా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఆ తర్వాత సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నెమ్మదిగా సాగింది. కూటమి అభ్యర్థి సత్యకుమార్ యదవ్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ప్రత్యేక బలగాల ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్, రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు దీపక్ తివారి బత్తలపల్లిలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. నల్లబోయనపల్లి గ్రామంలో రాత్రి 7గంటల వరకు పోలింగ్ సాగింది. డి చెర్లోపల్లిలో బూత్ నంబర్ 128లో ఈవీఎం మొరాయించడంతో పోలింగ్ అలస్యంగా సాగింది. సుమారు రాత్రి 10 గంటల వరకు సాగే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేశారు. మండలవ్యాప్తంగా 32657 మంది ఓటర్లు ఉండగా..27201 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాయంత్రం 7గంటల వరకు 83 శాతం పోలింగ్ నమోదు అయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రైలు ఢీకొని అంధుడి మృతి

కదిరిఅర్బన్, మే 13: తనకల్లు మండలకేంద్రంలో సోమవారం రైలు ఢీకొని అంధుడు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. రైల్వే ఎస్ఐ రహీమ్ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. తనకల్లుకు చెందిన మనోహర్ (24) సోమవారం ఓటు వేయడానికి పోలింగ్‌కేంద్రానికి వచ్చి.. తిరిగి ఇంటికి బయలుదేరాడు. అయితే మార్గం మధ్యలోని రైలు పట్టాలు దాటుతుండగా.. తిరుపతికి వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొంది. దీంతో అతడు అక్కడిక్కడే మృతి చెందారు. సంఘటనాస్థలాన్ని పోలీసులు పరిశీలించి, కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని, కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు అవివాహితడని రైల్వే ఎస్ఐ చెప్పారు.

వర్షంలో ప్రారంభమైన పోలింగ్



చెంచుగారిపల్లిలో బారులుతీరిన ఓటర్లు

ముదిగుబ్బ, మే 13: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌ను మండలంలో 61 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించారు. మండల కేంద్రంలో ఉదయం మోస్తారులో వర్షం కురవడంతో ఓటర్లు గొడుగులు పట్టుకుని మరీ ఓటు వేయడానికి వచ్చారు. బాలుర పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను ఎలక్షన్ అబ్జర్వర్ రాహుల్‌దేవ్ సింగ్, ఎస్పీ మాధవరెడ్డి తనిఖీ చేశారు. దొరిగల్లు పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అబ్జర్వర్ రిథం బాడ్గా పరిశీలించారు. ముదిగుబ్బలోని 56వ పోలింగ్ బూత్, చెంచుగారిపల్లిలోని 84వ పోలింగ్ బూత్‌లలో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా నడిచింది. హిందూపురం పార్లమెంట్ కూటమి అభ్యర్థి బీకే పార్థసారథి ఓటింగ్ ప్రక్రియపై స్థానిక నాయకులను అడిగి తెలుసుకున్నారు. రాత్రి 7గంటలు దాటినా బూదనాంపల్లి, రామస్వామితండా, బీడిమర్రి, నల్లచెర్లోపల్లిలలో ఓటు వేసేందుకు ఓటర్లు బారులు తీరారు. మండల వ్యాప్తంగా రాత్రి 7గంటల వరకు సైతం జరిగింది. ఓటింగ్ పూర్తయ్యే సరికి 87.72 శాతం పోలింగ్ నమోదైందని, 47063 మందికి ఓటర్లకు గాను 41285 ఓటు వేశారని ఎన్నికల అధికారులు తెలిపారు.



సాయంత్రమైనా 68వ బూత్ వద్ద బారులు తీరిన ఓటర్లు



ముదిగుబ్బలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి



పోలింగ్ కేంద్రం వద్ద పరిస్థితిపై ఆరా తీస్తున్న బీకే పార్థసారధి

కొత్తచెరువు మండలంలో ప్రశాంతంగా పోలింగ్



కొత్తచెరువులో బారులు తీరిన ఓటర్లు



తలమర్లలో ఓటు వేయడానికి వచ్చిన 98 ఏళ్ల వృద్ధురాలు

కొత్తచెరువు, మే 13: మండల వ్యాప్తంగా 38 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరిగింది. 33, 025మంది ఓటర్లకు గాను 22,518 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం 6గంటల వరకు ఓటుహక్కును ప్రజలు వినియోగించుకున్నారు. అప్పటికి 75.22శాతం పోలింగ్ నమోదైంది. అయితే మండల కేంద్రంలోని 20వ, 21వ, 28వ బూత్‌లలో, మరుకుంటపల్లిలోని 8వ, తలమర్లలో 2వబూత్‌లతో పాటు కొడపగానిపల్లి, నారేపల్లి, కేశాపురం గ్రామాలలో రాత్రి 9గంటల వరకు పోలింగ్ కొనసాగింది. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ రాజా రమేశ్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఉదయం ఓటు హక్కు వినియోగించుకునేందుకు మహిళలు, పురుషులు 7 గంటలకే బారులు తీరారు. వర్షం వస్తున్నా లెక్క చేయకుండా గొడుగులతో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. పలుచోట్ల మహిళలు చంటి బిడ్డలతో వచ్చారు. తలమర్లకు చెందిన వెంకటప్పగారి గంగమ్మ 98 ఏళ్ల వయస్సులో ఓటు హక్కును వినియోగించుకోవడానికి వచ్చి అందరినీ ఆశ్చర్యపరిచింది. వృద్ధులు,వికలాంగులు సైతం పెద్దఎత్తున ఓటుహక్కును వినియోగించుకున్నారు. కొన్నిచోట్ల పోలీసు సిబ్బంది లేకపోవడం కర్ణాకట రాష్ట్రానికి చెందిన హోంగార్డులుమాత్రమేఉండటంతో ఓటింగ్ ఆలస్యం అయింది. పోతులకుంట, ఎర్రపల్లి, మరుకుంటపల్లి, కొడపగానిపల్లి కేశాపురం, గ్రామాలలో వైసీపీ, టీడీపీనాయకుల మధ్య దూషణల పర్వం కొనసాగింది. పోలీసులు సకాలంలో స్పందించడంతో ఎలాంటి సంఘటనలు జరగలేదు. దీంతో కొత్తచెరువు మండల వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.



కొత్తచెరువులో వర్షానికి గొడుగులతో వస్తున్న ఓటర్లు

స్టోర్ డీలర్‌పై కత్తితో దాడి

ఓబుళదేవరచెరువు, మే 13: మండలంలోని కుసుమవారిపల్లికి చెందిన స్టోర్ డీలర్ నాగేంద్రపై అదే గ్రామానికి చెందిన రంగప్ప సోమవారం కత్తితో దాడిచేశారు. సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్, ఎస్ఐ వంశీకృష్ణ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. నాగేంద్ర, రంగప్పల మధ్య పాత కక్షలున్నాయి. అందులో భాగంగా నాగేంద్ర ఓటు వేసేందుకు వెళ్తుండగా రంగప్ప కత్తితో దాడి చేసి పొట్టలో పొడిచాడు. ఆ సమయంలో అడ్డుకున్న నాగేంద్ర భార్య నాగలక్ష్మికి కూడా రక్తగాయాలయ్యాయి. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. గాయపడిన వారిని బంధువులు ఓడీసీలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన చికిత్సకోసం కదిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రంగప్ప పోలీసుల అదుపులో ఉన్నారు. నాగేంద్ర బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీస్ అధికారులు తెలిపారు.



నాగేంద్రను ఆటోలో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

ప్రశాంతంగా పోలింగ్

నంబులపూలకుంట, మే 13: మండల వ్యాప్తంగా 30 పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. పి.కొత్తపల్లిలోని 200వ పోలింగ్ బూత్‌లో కొద్దిసేపు ఈవీఎం పనిచేయలేదు. దీంతో అరగంటపాటు ఓటర్లు నిరీక్షించారు. 201వ పోలింగ్ కేంద్రంలో, అల్లుగుట్టివారిపల్లిలో అరగంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. ఎస్సీకుంట 185వబూత్‌లో 15 నిమిషాలు అలస్యంగా ప్రారంభమైంది. వలస ఓటర్లు అధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

మడకశిరటౌన్, మే 13: నగర పంచాయతీ పరిధి లోని చీపులేటి గ్రామానికి చెందిన రైతు నరసింహా రెడ్డి(58) విద్యుత్‌షాక్‌తో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. అతడు సోమవారం పొలంలోకి పశువులను మేపడానికి వెళుతున్న సందర్భంలో ఉన్నఫళంగా 11కేవీ విద్యుత్ వైర్ నరసింహారెడ్డిపై తెగిపడింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. గేదె కూడా మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగారు.

బారులు తీరిన ఓటర్లు


● ఈవీఎం మొరాయించడంతో కొన్ని చోట్ల ఆలస్యంగా పోలింగ్ ప్రారంభం
● పురంలో వర్షంలోనే క్యూలో...


ఓటు వేయడానికి చంటి బిడ్డతో వస్తున్న మహిళ


ఉదయం 6 గంటలకే బారులు తీరిన ఓటర్లు


వీల్‌చైర్‌లో వచ్చి ఓటు వేసిన వృద్ధుడు

హిందూపురం అర్బన్, మే 13: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పట్టణంలోని ప్రతి కేంద్రం వద్ద ఓటర్లు బారులు తీరారు. మధ్యాహ్నం దాటిన క్యూ తగ్గలేదు. కొన్ని బూత్‌లలో ఆలస్యంగా పోలింగ్ మొదలైంది. ధర్మపురం 66వ పోలింగ్ బూత్‌లో వైసీపీ ఏజంట్‌లు ఆలస్యంగా రావడంతో పోలింగ్ ఆలస్యంగా రావడం, ఈవీఎం సరిగా పని చేయక పోవడంతో ఉదయం 7.26 పోలింగ్ ప్రారంభమైంది. ఆరు గంటల నుంచే క్యూలో నిలబడి న ఓటర్లు అసహనం వ్యక్తం చేశారు. ఉదయం నుంచి ఓటర్లు పోటెత్తారు. సాయంత్రం వర్షం కురిసినా గొడుగులు పట్టుకుని ఓటు వేసేందుకు క్యూలో నిలుచున్నారు.


ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్

ఓటు హక్కు వినియోగించుకున్న అభ్యర్థులు

హిందూపురం : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి నందమూరి బాలకృష్ణ దంపతులు హిందూపురం పట్టణంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. పట్టణంలోని ఆర్టీసీ కాలనీ 42వ పోలింగ్ బూత్‌లో నందమూరి బాలకృష్ణ, వసుంధరా దేవి క్యూలో నిలబడి ఓటు వేశారు. హిందూపురం అసెంబ్లీ వైసీపీ అభ్యర్థి దీపిక హిందూపురం మండలం బీరేపల్లి 10వ పోలింగ్ బూత్‌లో ఓటేశారు. మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ నాయకుడు షేక్ మహ్మద్ ఇక్బాల్ పట్టణంలోని చిన్న మార్కెట్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

చిలమత్తూరు: మండలకేంద్రంలోని జడ్పీ పాఠశాలలో జరుగుతున్న పోలింగ్ సరళిని హిందూపురం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నందమూరి బాలకృష్ణ సోమవారం సాయంత్రం పరిశీలించారు. పోలింగ్‌కు సంబంధించి పలు విషయాలను పోలింగ్ అధికారులతో అడిగితెలుసుకున్నారు. పోలింగ్ సమయం ఉన్నంత వరకు ఓటు వేసేందుకు ఓటర్లకు అవకాశం ఇవ్వాలని అధికారులను కోరారు.


చిలమత్తూరులో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న బాలకృష్ణ

ఆలస్యంగా ప్రారంభమైన పోలింగ్


చల్లాపల్లిలో బారులు తీరిన ఓటర్లు

పెనుకొండ టౌన్, మే 13 : పెనుకొండ మండలం వెంకటరెడ్డిపల్లిలో సోమవారం ఉదయం 7గంటల కే ఓటర్లు బారులుతీరారు. అయితే గంటపాటు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. ఎన్నికల అధికారులకు పూర్తి అవగాహన లేకపోవడంతో ఆలస్యమైనట్లు తెలిసింది. నోడల్ అధికారి చొరవతో 7-58కి ప్రారంభమైంది. ఉక్కపోత అధికంగా ఉన్నా ఓటర్లు గంటలకొద్ది కూలో నిలబడి ఓటేసి వెళ్లారు. పెనుకొండ మండలంలో ఎన్నికల నిబంధనలను ఆయా పార్టీ నాయకులు ఉల్లంఘించడంతో చెదురుమదురు సంఘటనలు చోటుచేసుకున్నాయి. మావటూరు, పెనుకొండ పట్టణంలోని ఉన్నతపాఠశలలో పోలీసులు ఓటర్లను అదుపుచేసే క్రమంలో దురుసుగా ప్రవర్తించారు. టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పెనుకొండ పట్టణంలోని జీఐసీ కాలనీలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి మధ్యాహ్నం ఓటువేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలోనే తమ గెలుపును నిర్ధారించారని, ఈ ఎన్నికలు మెజార్టీ కోసమే అన్నారు.


గంట ఆలస్యమైన వెంకటరెడ్డిపల్లిలో వేచి ఉన్న ఓటర్లు

రాత్రి వరకు కొనసాగిన పోలింగ్

పెనుకొండలో సాయంత్రం 6కు 78.77శాతం పోలింగ్

పెనుకొండ టౌన్, మే 13 : పెనుకొండ నియోజకవర్గంలో సాయంత్రం 6గంటలకు 78.77శాతం ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా 23,5986మంది ఓటర్లు ఉండగా ఇందులో 117952 పురుషులు, 118030మహిళలు, నలుగురు ఇతరులు ఉన్నారు. సమయం 9గంటలు కావస్తున్నా ఓటర్లు బారులు తీరడంతో పోలింగ్‌శాతాన్ని ఎన్నికల అధికారులు ఇవ్వలేకపోయారు. డీఎస్పీ బాబాజాన్‌సైద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పర్యవేక్షించారు. సోమందేపల్లి మండలం బ్రాహ్మణపల్లిలో ఉన్నపళంగా భారీ వర్షం రావడంతో షామియానా కింద ఉన్న ఓటర్లు తడిసి ముద్దయ్యారు. కొందరు ఓటర్లు మరోచోటికి పరుగులు తీశారు.

పెనుకొండ రూరల్, మే 13 : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మండలంలో వెంకటరెడ్డిపల్లి 171, 172 పోలింగ్ కేంద్రాలు, మరువపల్లి పోలింగ్ కేంద్రాలు రాత్రి 9వరకు పోలింగ్ జరిగింది. వెంకటరెడ్డిపల్లిలో 171, 172కేంద్రాల్లో ఉదయం 7గంటలకు ప్రారంభం కావాల్సిన ఓటింగ్ ప్రక్రియ 8.30కు ప్రారంభమైంది. దీంతో సాయంత్రం 6గంటలు దాటినా రోడ్డువరకు ఓటర్లు క్యూలో నిలబడ్డారు. ఎన్నికల అధికారులు క్యూలో ఉన్న వారికిఓటరు స్లిప్పులు పంపిణీ చేసి రాత్రి 9గంటలైనా ఓటింగ్ ప్రక్రియ చేపడతామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మహిళలు, వృద్ధులు, యువత బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

అగళి : మండలంలోని పలు కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించ డంతో రాత్రి వరకు ఓటింగ్ రాత్రి వరకు కొనసాగింది. దాసేగౌడనహళ్లిలో మూడుసార్లు ఈవీఎంలు మొరాయించాయని ఓటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు మరమ్మతులు చేయించి ఓటింగ్‌ను కొనసాగించారు. అదేవిధంగా హెచ్‌డిహళ్లి, ఆర్‌జీపల్లి, కోడిపల్లి, అగళి, నరసాంబుది తదితర గ్రామాల్లో రాత్రైనా ఓటింగ్ కొనసాగుతూనే ఉంది. ఓటువేసేందుకు ప్రజలు బారులు తీరారు.


మావటూరులో చంటిబిడ్డతో ఓటేసేందుకు వచ్చిన మహిళలు


కరిదాసనపల్లిలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న మహిళలు

మడకశిరలో 74.25 శాతం పోలింగ్


మడకశిరలో క్యూలో నిలబడిన ఓటర్లు

మడకశిర/మడకశిరటౌన్, మే 13: చిన్న చిన్న సంఘటనలు మినహా నియోజకవర్గంలో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. నియోజకవర్గం వ్యాప్తంగా 241 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద ఓటు హక్కును వినియోగించుకొనేందుకు బారులు తీరారు. ఉదయం పోలింగ్ మందకొడిగా సాగినా మధ్యాహ్నం నుంచి పుంజుకొంది. ఉదయం 9 గంటలకు 3.50 శాతం పోలింగ్ నమోదు కాగా 11 గంటలకు 29 శాతం, మధ్యాహ్నం 1 గంటకు 46.20 శాతం, మధ్యాహ్నం 3 గంటలకు 63.40 శాతం నమోదైంది. 4 గంటలకు 66.20 శాతం, సాయంత్రం 5 గంటలకు 71.25 శాతం, 6 గంటలకు 74.25 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఎన్నికల సందర్భంగా నియోజక వర్గం వ్యాప్తంగా 144 సెక్షన్ విధించారు. ఎక్కడ ఎలాంటి సంఘటనలకు తావు లేకుండా పోలీసులు గట్టి బందోబస్తును నిర్వహించారు. వలస ఓటర్లు సైతం ఈసారి తమ ఓటు హక్కు వినియోగించుకొన్నారు. వృద్ధులకు ఇళ్లవద్దే ఓటు హక్కును వినియోగించుకొనే అవకాశమున్నా అధికారులు పూర్తి స్థాయిలో గుర్తించకపోవడంతో పలువురు పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చి ఓటు వేశారు. శివాపురం పోలింగ్ కేంద్రానికి చిన్న నాగప్ప అనే 85 ఏళ్ల వయసు ఉన్న వృద్ధుడు వచ్చి ఓటు వేశాడు.


ఓటు హక్కు వినియోగించుకొన్న నాయకులు

మడకశిరటౌన్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం జరిగిన పోలింగ్‌లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు శింగనమల మండలం అలంకరాయణపేటలో ఓటు హక్కు వినియోగించుకొన్నారు. మడకశిర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకొన్నారు. మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న అమరాపురం మండల కేంద్రంలో ఓటు వేశారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కేసుధాకర్ గుడిబండ మండలం కరికెర గ్రామంలో, ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి మడకశిర జూనియర్ కళాశాలలో ఓటు వేశారు. ఇదిలా ఉండగా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు, ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి సైకిల్ తొక్కుతూ పట్టణంలో పట్టణంలోని పోలింగ్ కేంద్రా లను పరిశీలించారు. పోలింగ్ సరళిపై అక్కడ ఉన్న అధికారులను అడిగి తెలుసుకొన్నారు. వారి వెంట రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణ, నాయకులు తదితరులు ఉన్నారు.


పోలింగ్ బూత్‌ల పరిశీలనకు సైకిల్‌పై వెళ్తున్న ఎంఎస్ రాజు, గుండుమల తిప్పేస్వామి

ఓటరు స్లిప్పులో తప్పుగా పోలింగ్ కేంద్రం

ఇబ్బందులు పడిన ఓటర్లు




పోలింగ్ కేంద్రం ఎంఆర్‌ఎస్ స్కూల్ అని ఓటర్లకు ఇచ్చిన ఓటర్‌స్లిప్పు, స్లిప్పు చూపుతున్న ఓటరు

మడకశిర రూరల్, మే 13 : మడకశిర మన్సిపాలిటీలోని నాలుగో వార్డులో ఉన్న చాలా మంది ఓటర్లకు పోలింగ్ కేంద్రం ఒక చోట, ఓటు మరోచోట ఉండడంతో ఓటువేయడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వారి ఓటరు స్లిప్పులో పోలింగ్ కేంద్రం ఎంఆర్‌ఎస్ స్కూల్ అనిఉంది. వాటితో ఉదయాన్నే ఎంఆర్‌ఎస్ స్కూల్ పోలింగ్ కేంద్రం (193) వద్దకు వెళ్లి గంటల కొద్ది క్యూలో ఉన్నారు. అయితే పీఓ మీ ఓటు ఉర్దూస్కూల్(185) పోలింగ్ కేం ద్రంలో ఉందని చెప్పి పంపారు. ఓటర్ స్లిప్పులో వివరాలు సరిగాలేకపోవడంతో ఆ వార్డులోని చా మంది ఓటర్లు అనేక ఇబ్బందులు పడ్డారు.అధికారుల నిర్లక్ష్యం ఓటర్లుకు శాపంగా మారిందని ఆేదన వ్యక్తంచేశారు.

ప్రశాంతంగా సార్వత్రిక ఎన్నికలు

గుడిబండ, మే 13 : మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. 2019కంటే ఓటు శాతం పెరిగింది. అయితే అధికారులు సౌకర్యాలు కల్పిం చడంలో విఫలమయ్యారని పలు గ్రామాల ఓటర్లు ఆరోపించారు. మండలంలోని ఎస్ రాయాపురం గ్రామంలో చిన్న షామియానా ఏర్పాటు చేయడంతో గంటల తరబడి ఎండలో క్యూలో నిలబడాల్సి వచ్చిందన్నారు. ఇదిలా ఉండగా ఎస్ రాయాపురంలో అచేతన స్థితిలో ఉన్న వృద్ధులు హనుమం తరాయప్ప, నరసప్పను కుటుంబ సభ్యులు ఆటోలో తీసుకెళ్లి ఓటు వేయించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి మండలంలోని గుడిబండ, మోరుబాగల్, ఎస్ రాయపురం, ఎస్ఎస్‌గుండ్లు, మందలపల్లి తదితర గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

రొళ్ల : మండలంలో సోమవారం సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. పోలింగ్ ఉదయం నుంచి మందకొడి గా సాగినా సాయంత్రం పుంజుకుంది. వయో వృద్ధులు, వికలాంగులు సైతం తమ ఓటు హక్కును విని యోగించుకున్నారు.


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి

ఓటు హక్కును వినియోగించుకున్న సబ్ కలెక్టర్


ఓటు వేసి వచ్చిన సబ్ కలెక్టర్ అపూర్వ భరత్

పెనుకొండ టౌన్, మే 13: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ సోమవారం పట్టణంలోని ఆల్విన్ కాలనీ పోలింగ్ బూత్ 153లో ఓటు హక్కు వినియోగించు కున్నా రు సాధారణ ఓటరు లా క్యూలో నిలబడి ఓటు వేశారు. పోలింగ్ బూత్‌లో సౌకర్యాలపై ఆరా తీశారు. షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్ప పోలింగ్ బూత్ 164లో తండ్రి భాస్కర్‌రెడ్డితో కలిసి ఓటు వేశారు.


ఓటు వేసిన గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్ప, ఆమె తండ్రి భాస్కర్‌రెడ్డి

ఆలస్యంగా పోలింగ్ ప్రారంభం

రొద్దం, మే 13: మండలంలో సార్వత్రిక ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. మండల పరిధిలోని 48పోలింగ్ బూత్‌లలో ఎన్నికలు జరిగాయి. హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి బీకే పార్థసారథి ఉదయం 7గంటలకే ఆర్ మరువపల్లి 27వ పోలింగ్‌బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. బూచర్ల, శేషాపురం గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించడంతో ఎన్నికలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. చిన్నమంతూరులో ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్ ఏజెంట్‌గా కూర్చోవడంతో టీడీపీ నాయకులు అభ్యంతరం తెలిపారు. దీంతో కొంతసేపు పోలింగ్ నిలిచిపోయింది. తాడంగిపల్లిలో 11గంటల సమయంలో ఈవీఎంకు చార్జింగ్ అయిపోవడంతో పోలింగ్ కొంతసేపు ఆగిపోగా బ్యాటరీ మార్చడంతో సజావుగా ఎన్నికలు జరిగాయి. గోనిమేకలపల్లిలో వైసీపీ నాయకులు పదే పదే పోలింగ్ కేంద్రంలోకి వెళ్తుండటంతో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య తోపులాట జరిగింది. మండల వ్యాప్తంగా గ్రామాల్లో ఓటర్లు బారులు తీరారు. రొద్దంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న పోలింగ్ బూత్‌లలో పీఓ ఓటు వేసేందుకు ఓటర్లకు సహకరిస్తున్నాడని పీఓపై టీడీపీ ఎన్నికల చీఫ్ ఏజెంట్ మాధవ నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. శేషాపురం గ్రామంలో ఎంపీ అభ్యర్థి ఈవీఎంలో ఓటు నమోదు ప్రక్రియ ఆలస్యంగా జరిగింది. పెనుకొండ సీఐ యుగంధర్ ఎన్నికల బందోబస్తును నిర్వహించారు.

ఓటు హక్కు వినియోగించుకున్న రఘువీరారెడ్డి

మడకశిర రూరల్, మే 13: మాజీ మంత్రి, సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి దంపతులు నీలకంఠాపురంలోని 212పోలింగ్ బూత్‌లో ఓటుహక్కును వినియోగించుకు న్నారు. మండల వ్యాప్తంగా పోలింగ్ ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రశాంతంగా జరిగింది, ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి సాయంత్రం కల్లుమర్రి ఉన్నత పాఠశాలోని 234, 235 పోలింగ్ బూత్‌లను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. వివిధ పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులు వీల్ చైర్‌లో వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. కదిరేపల్లి పోలింగ్ బూత్‌లో ఓటు వేసి ద్విచక్రవాహనంలో వెళుతున్న ఇద్దిరు వాహనం అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో వారు తీవ్రంగా గాయపడ్డారు.

చెరువులో గుర్తుతెలియని శవం

లేపాక్షి, మే 13 : మండలంలోని మానెంపల్లిలో గుర్తుతెలియని వ్యక్తి శవం లభ్యమైనట్లు ఎస్ఐ గోపి తెలిపారు. మానెంపల్లి చెరువులో సోమవారం దాదాపు 40ఏళ్ల వయసున్న వ్యక్తి శవాన్ని గోనెసంచిలో చుట్టి పడేశారని తెలిపారు. ఎవరో ఎక్కడో హత్యచేసి ఇక్కడ పడేశారా లేక ఇక్కడే హత్యచేశారా అనేదానిపై విచారిస్తున్నారు. శవం బాగా కుళ్లిపోయింది. హత్యచేసి దాదాపు పది రోజులై ఉంటుందని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

విద్యుదాఘాతంతో రైతు మృతి

మడకశిరటౌన్, మే 13: నగర పంచాయతీ పరిధిలోని చీపులేటి గ్రామానికి చెందిన రైతు నరసింహారెడ్డి(58) విద్యుత్‌షాక్‌తో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. అతడు సోమవారం పొలంలోకి పశువులను మేపడానికి వెళుతున్న సందర్భంలో ఉన్నఫళంగా 11కేవీ విద్యుత్ వైర్ నరసింహారెడ్డిపై తెగిపడింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. గేదె కూడా మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగారు.

నేడు ఎన్నికల సరళిపై సమీక్ష

మడకశిరటౌన్, మే 13: నియోజకవర్గం వ్యాప్తంగా జరిగిన సార్వత్రిక ఎన్నికల సరళిపై మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ నియోజకవర్గ సమన్వయ కర్త గుండుమల తిప్పేస్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలాజీనగర్‌లోని టీడీపీ పార్టీ కార్యాలయం ఆవరణంలో ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజుతో కలిసి సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల నాయకులు, కార్యకర్తలు, కన్వీనర్లు, టీడీపీ అనుబంధ సంఘాల నాయకులు అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా అక్కమ్మ గార్ల గంగపూజ

పావగడ, మే 13: తాలూకాలోని నాగలమడక పంచాయతీ పరిధిలోని తిమ్మంపల్లి లో ముతిమడుగు వీర ఓబమ్మ ఆలయం వద్ద ఉన్న అక్కమ్మగార్ల దొనలో సోమవారం గంగపూజ ఘనంగా నిర్వహించారు. ఏడుగురు బాలికలతో ఉదయం గంగ పూజ చేయించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


ఏడుగురు బాలికలతో గంగపూజ చేస్తున్న దృశ్యం

పురంలో సాయంత్రం 7కు 73.32శాతం పోలింగ్

హిందూపురం, మే 13 : నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా హిందూపురం అసెంబ్లీ సెగ్మెంట్‌లో సాయంత్రం 7గంటల సమయానికి 73.32శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 7గంటలకే ప్రారంభమైన పోలింగ్ కొన్నిచోట్ల రాత్రి 10గంటలు దాటినా కూడా కొనసాగింది. దీంతో పూర్తిస్థాయి పోలింగ్‌శాతం అధికారులు తెలుపలేకపోయారు. నియోజకవర్గ వ్యాప్తంగా 2,49,174ఓట్లుండగా ఇందులో పురుషులు 1,24,730, మహిళలు 1,24,425, ఇతరులు 19మంది ఉన్నారు. సాయంత్రం 7గంటల సమయానికి ఎన్నికల అధికారులు తెలిపిన వివరాలనుబట్టి 73.32శాతం నమోదైందని తెలిపారు.

బందోబస్తు మధ్య : పోలింగ్ సందర్భంగా సోమవారం హిందూపురం నియోజకవర్గంలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రం వద్ద 144సెక్షన్ విధించారు. అయితే హిందూపురం మండలం ఎం.బీరేపల్లిలో వైసీపీ అభ్యర్థి స్వగ్రామం అయితే ఇక్కడ ఈవీఎం పలుసార్లు మొరాయించడంతో రాత్రి 10.30 గంటలు దాటేవరకు పోలింగ్ కొనసాగింది. 86.68శాతం పోలింగ్ అయినట్లు అధికారులు తెలిపారు.

తొలిసారి ఓటింగ్


సిరా గుర్తు చూపుతున్న యువత

హిందూపురం అర్బన్, మే 13: తొలిసారి పవిత్రమైన ఓటును వేసినందుకు చాలా గర్వంగా ఉందని తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్న యువకులు తెలిపారు. ఇప్పుడు మేము ఆంధ్రులం అని చెప్పుకుంటాము. ఇంతకు ముందు ఉద్యోగ అన్వేషణకు ఉపాధికి ఇతర రాష్ట్రాలకు పోయినపుడు ఏపీ వాసులంటే వారికి రాజధాని కూడా లేదని హేళన చేసేవారు. సిగ్గుగా ఉండేది. ఇప్పుడు ఓటు వేసినందుకు తెలియని ఉత్సాహం నెలకొంది. మా ఓటు సద్వినియోగం అవుతుందనుకుంటున్నామని అన్నారు.

మౌలిక వసతులు కల్పించాకే ఓటు

'పురం'లో కాలనీ వాసుల నిరసన


ఇందిరమ్మ కాలనీ వద్ద ధర్నా చేస్తున్న కాలనీ వాసులు

హిందూపురం అర్బన్, మే 13: 'మా కాలనీకి తాగునీరు, రోడ్లు, డ్రైన్లు, విద్యుత్ సౌకర్యం కల్పించాకే ఓటు వేస్తాం' అని మండల పరిధిలోని ఇందిరమ్మ కాలనీ, కొటిపి పంచాయతీకి చెందిన భరత్ నగర్ కాలనీ వాసులు సోమవారంనిరసనకు దిగారు. రాష్ట్ర వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు జరుగుతుంటే ఇందిరమ్మ, భరత్‌నగర్ కాలనీ వాసులు మాత్రం ఎన్నికలను బహిష్కరించారు. తమ కాలనీలకు మౌలిక వసతులు కల్పించాకే ఓటు వేస్తామని ఖరాకండిగా చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో తమకు ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని ఆగ్రహించారు. గత ఐదు సంవత్సరాలుగా ఇక్కడ గెలిచిన సర్పంచ్ కానీ, నాయకులు కానీ తమ అతిగతి విచారించిన పాపాన పోలేదని మండిపడ్డారు. కాలనీలకు రోడ్లు సరిగా లేవని గ్యాస్ సిలెండర్ సరఫరాచేసే వారు కూడా రావడంలేదన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 108 వాహనం కూడా ఇక్కడికి రాలేని పరిస్థితి దాపురించిందని అన్నారు. డ్రైన్లు లేక మురుగునీరు ఇళ్ల వద్దే నిలువ ఉండిపోయి రోగాలబారిన పడుతున్నామని అన్నారు. రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరా సరిగాలేక విషపురుగలబారిన పడతామని భయమేస్తుందన్నారు. ప్రతి రోజు దినదిన గండంగా భయంతో బతుకుతున్నామని ఆవేదన చెందారు. ఎన్ని మార్లు తమ పరిస్థితి తెలియజేసినా ఎవరూ పట్టించుకోలేదని వాపోయారు. దీంతో సోమవారం ఎన్నికలు బహిష్కరించి కాలనీలో ధర్నా చేపట్టామన్నారు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం మాజీ సర్పంచ్ హెచ్‌ఎన్ రాము, ఇందిరమ్మ కాలనీ వద్దకు వెళ్లి రానున్నది తెలుగుదేశం ప్రభుత్వమే అని, మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

గోరంట్లలో ప్రశాంతంగా పోలింగ్


ఓటు హక్కు వినియోగించుకున్న జీఎం శేఖర్


గోరంట్లలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కూటమి అభ్యర్థి సవిత


బాలుర పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని సందర్శిస్తున్న బీకే పార్థసారథి

గోరంట్ల, మే 13: మండలంలోని 70 పోలింగ్ కేంద్రాల్లో స్వల్ప సంఘటన మినహా సోమవారం ప్రశాంతంగా పోలింగ్ ముగిసింది. గోరంట్ల ఉర్దూ ఉన్నత పాఠశాలలోని 244 వ పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు మొరాయించడంతో అరగంట ఆలస్యంగా పోలింగ్ ప్రా రంభమైంది. మందపల్లిలోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. బాలుర ఉన్నతపాఠశాలలోని 237వ కేంద్రం, రాజీవ్‌కాలనీలోని పోలింగ్‌కేంద్రం 234, వంకవీధిలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన 231 కేంద్రం వద్ద ఓటర్లు బారులు తీరారు. ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో 238, 239 పోలింగ్‌కేంద్రాలకుగాను స్థలంలేక ఒకే క్యూలైన్ ఏర్పాటుచేయడంతో ఓటర్లు అసౌకర్యానికి గురయ్యారు. రాజీవ్‌కాలనీలో ఇదే పరిస్థితి. బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ ఉర్దూ పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. టీడీపీ కూటమి అభ్యర్థి సవిత ఉదయం నుంచి మండలంలోని పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేకదృష్టి సారించి పరిశీలించారు. పులేరులో సవితతో పాటు టీడీపీ నాయకులు పోలింగ్ కేంద్రాలోకి వెళ్లకూడదంటూ వైసీపీ నాయకులు విభేదించడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. సీఆర్‌పీఎఫ్ దళాలు పరిస్థితిని చక్కదిద్దారు. బూదిలి ప్రాథమిక పాఠశాల వద్ద మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, ఎంపీటీసీ మంజునాథ్ పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీకి మద్దతుగా ప్రచారం చేస్తున్నారని వైసీపీ నాయకులు ఘర్షణకు సిద్దపడగా పోలీసులు సర్దిచెప్పారు. అనంతరం టీడీపీ అభ్యర్థి సవితతో వేణుగోపాల్‌రెడ్డి ఫొటో దిగి తన మద్దతు ప్రకటించారు. గుట్టిపల్లి, మలసముద్రంలో స్వల్ప సంఘటలు చోటు చేసుకున్నాయి. సాయంత్రం 4.30 సమయంలో గాలివాన వల్ల పాలసముద్రం, చెండురూవాండ్లపల్లి, పులేరు, గోరంట్ల ఎమ్మార్సీ కేంద్రాల్లో పోలింగ్‌కు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సరఫరా సరిగా లేకపోవడం, వర్షం కురవడంతో, గాలి వెలుతురు లేక పోలింగ్ కేంద్రాల్లో గుర్తులు సరిగా కనిపించక ఓటర్లు ఇబ్బంది పడ్డారు. పులేరు, గోరంట్ల ఎమ్మార్సీ వద్ద ఓటర్లు వందల సంఖ్యలో వేచి ఉన్నారు. వర్షంలో తడుస్తూ, షామీయానాల కింద ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. మొత్తం మీద ప్రజలు ఓటు వేయడానికి తరలి రావడంతో ప్రశాంతంగా ఓటింగ్ జరిగింది.

ఓటు వేసిన నిమ్మల : పట్టణంలోనిఎమ్మార్సీ పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప కుటుంబ సభ్యులు సోమవారం ఓటు హక్కు వినియోగించుకున్నారు. పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను కూటమి ఎంపీ అభ్యర్థి బీకే పార్థ సారథి పరిశీలించారు. మండలం లోని పాలసముద్రం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ భర్త చరణ్‌రెడ్డితో పాటు ఓటు వేశారు.